క్లుప్తంగా

బాలకార్మిక వ్యవస్థపై నిఘా



బల్లిలో ఇటుక బట్టీల వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసులు

బలిజిపేట: బాలకార్మిక వ్యవస్థపై బలిజిపేట పోలీస్‌శాఖ నిఘా పెట్టింది. అందులో భాగంగా ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఇటుక బట్టీలు, చిన్న చిన్న షాపులు, టీ దుకాణాలు, కిరాణాషాపుల వద్ద బాలకార్మికులు ఉన్నారా? లేదా? అని పర్యవేక్షించారు. బాల కార్మికులను ప్రోత్సహించేవారికి, కార్మికునిగా పనిచేస్తున్న బాలుడి తల్లిదండ్రులకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఎవరూ బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించరాదని హెచ్చరికలు జారీచేశారు. ఎవరి దృష్టిలో ఉన్నా సమాచారాన్ని పోలీస్‌శాఖకు తెలియచేయాలని ఎస్సై ప్రశాంత్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● డీఐఓ జగన్మోహన్‌రావు



విద్యార్థులకు ఫైలేరియా మాత్రలు వేయించే విధానాన్ని పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహన్‌రావు

పాచిపెంట: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) టి.జగన్మోహన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఫైలేరియా నివారణ మాత్రల పంపిణీని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధిపై పిల్లలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని హితవు పలికారు. ఆయన వెంట పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవిచంద్ర, ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తదితరులు ఉన్నారు.

సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు



పోలీసుల అదుపులో ముద్దాయి

గరుగుబిల్లి: సారా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కొత్తూరు గ్రామ సమీపంలో బొత్స బలరాం అనే వ్యక్తి సారా ప్యాకెట్లు తీసుకుని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 103 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. అతనిపై గతంలో కూడా రెండు కేసులు నమోదైనట్లు చెప్పారు. ముద్దాయిని పార్వతీపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



చిన్నకోటిపల్లిలో సీసీరోడ్డు పనులు చేపడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కోటిపల్లి సర్పంచ్ సింగంవలస మంగామణి అన్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. సమస్యలపై వెంటనే స్పందించిన వారు సీసీరోడ్డు నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో రహదారి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాడిపశువుల సంక్షేమానికి కృషి

వీరఘట్టం: రానున్న వేసవిలో పశుగ్రాసం కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వీరఘట్టం పశు వైద్యాధికారి సీహెచ్.చైతన్యశంకర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా వెయ్యి కిలోల గడ్డి విత్తనాలను 77 శాతం సబ్సిడీపై యూనిట్(5 కిలోలు) రూ.109ల చొప్పున రైతులకు అందజేసినట్లు చెప్పారు. పాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు 12 చోట్ల స్థల సేకరణ చేసి రైతులకు అప్పగించామన్నారు. పశువులు, గొర్రెలకు చర్మ వ్యాధులు, గర్భకోశ సంబంధిత, ఇతర వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం సమకూర్చిన అత్యవసర వాహనం ద్వారా ఊరూరా సంచార పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు.

ఫైలేరియా మాత్రల పంపిణీ విజయవంతం

● డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు



బలిజిపేట: ఉన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న రామనాథం



మక్కువ: వీరాడవలసలో మాత్రలు పంపిణీ చేస్తున్న వలంటీర్, వైద్యసిబ్బంది



పార్వతీపురం టౌన్: ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఫైలేరియా (ఆల్బెండజోల్, డీఈసీ) మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాధరావు అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు, ఏలికపాముల నివారణ, తద్వారా సంభవించే రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్, డీఈసీ మాత్రలు ఉపయోగపడుతాయని చెప్పారు. మందుల పంపిణీ పక్కాగా జరగాలని, మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఉన్న 37 పీహెచ్‌సీల పరిధిలోను, 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, 2పీపీ యూనిట్‌ల పరిధిలో మొత్తం 7,01,884 మందికి పంపిణీ చేస్తామని తెలిపారు. రెండు సంవత్సరాల వయస్సు లోపు పిల్లలు, గర్భిణులు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న వారికి మాత్రలు వేయరాదని సూచించారు. ఆహారం తీసుకున్న తరువాత మాత్రమే మాత్రలు వేయాలని, ఖాళీ కడుపుతో తీసుకోరాదన్నారు. మాత్రల వల్ల ప్రయోజనం కలుగుతుందని, దుష్ప్రభావాలు ఉండవని స్పష్టం చేశారు. మాత్రలు వేసుకున్న అనంతరం ఆరోగ్యంలో మార్పులు, అస్వస్థత కలిగినట్లు సందేహం వస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రాజెక్టు అధికారి ధవళ భాష్కరరావు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బోదవ్యాధిని నివారిద్దాం

బలిజిపేట: బోదవ్యాధిని నివారిద్దామని మలేరియా నివారణ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథం పిలుపునిచ్చారు. జాతీయ ఫైలేరియా నివారణ వారోత్సవంలో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డీఈసీ, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి నిర్మూలను అందరం కృషిచేయాలని కోరారు. వ్యాధిని పెంచకుండా, దరిచేరకుండా ఉండేందుకు ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఎంపీపీ నాగమణి, జిల్లా డిప్యూటీ మలేరియా అధికారిణి ఎం.తులసి, సెంట్రల్ నోడల్ అధికారి లక్ష్మణ, మలేరియా రాష్ట్ర కన్సల్టేషన్ అధికారి సాయికుమార్, ఎంపీడీఓ భానుమూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్, సీహెచ్‌ఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈసీ మాత్రల పంపిణీ

మక్కువ: మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్యాధికారులు హరికృష్ణ, రఘు పర్యవేక్షణలో బుధవారం గ్రామవలంటీర్లు, వైద్యసిబ్బంది డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ కీటక జనిత వ్యాధినియంత్రణ కార్యక్రమంలో భాగంగా బోదవ్యాధి నియంత్రణకు ఉచిత సామూహిక డీఈసీ మాత్రల పంపిణీ చేపట్టినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన క్యాంప్ కార్యాలయం వద్ద పార్వతీపురం పురపాలకసంఘం ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 16 నుంచి పార్వతీపురం పురపాలకసంఘంలో గల 15 సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు, కన్వీనర్లు, గృహసారథులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు అడిగినందుకు దాడి



చికిత్స పొందుతున్న సీతారాం

పార్వతీపురం: తనకు రావల్సిన ధాన్యం డబ్బులను అడిగినందుకు ఇవ్వాల్సిన వ్యక్తి దాడి చేయడంతో మంగళవారం రాత్రి ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన బర్ల సీతారాం తనకు రావల్సిన ధాన్యం డబ్బులను ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన బర్ల సూరినాయుడిని అడిగాడు. దీనికి సూరినాయుడు స్పందించి నాకు నచ్చినపుడు ఇస్తానని అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పక్కనే ఉన్న కర్రతో సీతారాం తలపై సూరినాయుడు కొట్టగా తలపై తీవ్రగాయం కావడంతో బుధవారం జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకుంటున్నాడు. ఈ మేరకు ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20న గిరిజన సంఘం ధర్నా



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకుడు గంగాధర్

సీతంపేట: ఈనెల 20న గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ జీసీసీ బ్రాంచ్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం నాయకులు ఎ.గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక గిరిజన సంఘం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అటవీఉత్పత్తులకు బయట మార్కెట్ కంటే తక్కువ మద్దతు ధరలు ప్రకటించడం అన్యాయమన్నారు. చింతపండు కిలో రూ.50, పసుపు రూ.100, గ్రేడ్ వన్ కొండచీపురు రూ.65 ఇలా ధరలు పెంచి కొనుగోలు చేయాలన్నారు. లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు జె.శ్రీరాములు, కైలాస్, సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపై అవగాహన



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు, డాక్టర్ కమల్‌నాథ్

పాలకొండ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ డి.త్రినాథులు అన్నారు. మండలంలోని అన్నవరం పీహెచ్‌సీలో వైద్యాధికారి వేములకొండ కమల్‌నాథ్ నేతృత్వంలో ఆరోగ్య సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ వ్యాధుల నివారణకు కృషిచేయాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సీడీసీడీ, ఎస్‌జీడీ సర్వేలు సక్రమంగా పూర్తిచేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సూచనలు, సలహాలు అందిస్తూ వారిని చైతన్యపర్చాలన్నారు.

ఎంఎల్‌సీ స్టాక్ పాయింట్ తనిఖీ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఎం.ఎల్.సి స్టాక్ పాయింట్ ప్రధాన గోదాంను శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, పర్యవేక్షణ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకుల నిల్వలు, రికార్డుల్లో ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలు, వసతి గృహాలు, రేషన్ డిపోలకు తరలించిన బియ్యం స్టాకు వివరాలను గోదాం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావును అడిగి తెలుసుకున్నారు. రికార్డులన్నీ పక్కాగా ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

మంచినీటి పథకాలకు రక్షణ గోడలు



తామరఖండిలో వాటర్‌ట్యాంక్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ఓవర్ హెడ్‌ట్యాంక్‌లకు రక్షణ గోడల నిర్మాణం వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని తామరఖండి, గెడ్డలుప్పి, లచ్చయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పథకాలకు సంబంధించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో ఇంటింటి కుళాయిల నిర్మాణంతో పాటు జగనన్న కాలనీల్లో అమరుస్తున్న మంచినీటి పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల చుట్టూ ప్రహరీల పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. అన్నిగ్రామాలకు ఇంటింటి కుళాయిల పథకం నిధులతో నిర్వాహకులు, కాంట్రాక్టర్లు చేస్తున్న పనులు పూర్తిచేసి వస్తున్న వేసవిలో ప్రజలకు మంచినీరు సరఫరా చేయడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. బగ్గందొరవలస జంక్షన్‌లో మంచినీరు సరఫరాకు కొత్తగా కనెక్షన్లు ఇవ్వాలని ఇటీవల ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఇచ్చిన ఆదేశాల మేరకు ట్యాప్‌లు అమర్చడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. తామరఖండిలో పీఏసీఎస్ చైర్మన్ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రహరీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. గెడ్డలుప్పిలోని రెండు వీధుల్లో సర్పంచ్ అల్లుతిరుపతిరావు ఆధ్వర్యంలో అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటకు తీరిన నీటి కష్టాలు



నీరు విడుదల చేస్తున్న సర్పంచ్ సీహెచ్ కృష్ణ

సీతానగరం: దశాబ్ద కాలంగా మండలంలోని లచ్చయ్యపేట గ్రామప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య తీరింది. రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న లచ్చయ్యపేట గ్రామస్తులు ఏటా ఫిబ్రవరి నెల నుంచి జూన్ వరకూ తాగునీరు కోసం అవస్థలు పడడం , రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసేవారు. ఇటీవల గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరడంతో ఎమ్మెల్యే స్పందించి మంచీరు బోరు వేయించి తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తీసిన బోరుకు బుధవారం సాయంత్రం మోటార్ అమర్చి నీరుతోడడంతో మంచినీటి సమస్య తీరిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుడు, గ్రామ పెద్దల కృషి ఫలితంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు మంజూరు చేయడంతో గ్రామానికి మంచినీటి సమస్య తీరిందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి



స్థానిక బస్‌స్టాండ్ వద్ద హోర్డింగ్‌ల తొలగింపుపై మాట్లాడుతున్న మండల అధికారులు

● తహసీల్దార్, ఎంపీడీఓలు

సీతానగరం: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో మండలంలోని రాష్ట్రీయ రహదారి, మండలకేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులు, ఇతర నాయకులు బ్యానర్లు స్వచ్ఛందంగా తొలగించి అధికారులకు సహకరించాలని తహసీల్దార్ ఎన్వీరమణ, ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రహదారిని అనుకుని ఉన్న బ్యానర్లను సంబంధిత కార్యదర్శులు వీఆర్వోల ఆధ్వర్యంలో తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తున్నందున ముందు జాగ్రత్త చర్యగా సంబంధిత రాజకీయ నాయకులతో అవగాహన కల్పించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న బ్యానర్లను తొలగించేలా చర్యలు చేపట్టారు. అలాగే గ్రామాల్లో ఎన్నికల ప్రచార సామగ్రి స్థలం లబ్ధిదారుల అనుమతిలేనిదే ఏర్పాటు చేస్తే ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలోకి వస్తుందన్నారు. ఎన్నికల పరిశీలకులు తిరుగాడే ప్రాంతాల్లో, ఎన్నికలు నిర్వహించాల్సిన సీతానగరంలో ఎన్నికల నియమావళి విధిగా అమలు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచనలిచ్చామని తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె. కుమావర్మ, వీర్వోలు పి.కుమారస్వామి, ఎం.సింహాచలం, మేజర్ పంచాయతీ ఈఓ వెంకటరావు, పోలీసులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలను విద్యార్థులు ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న డైట్ అధ్యాపకుడు ఈశ్వరరావు

సీతానగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపొందించడానికి, పరిక్షల సమయంలో ఎదుర్కోవలసిన విధానాన్ని అలవర్చుకోవాలని జిల్లాఉపాధ్యాయ శిక్షణ కేంద్రం అధ్యాపకుడు డి.ఈశ్వరరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ''పరీక్షా పర్వ్'' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న పబ్లిక్ పరీక్షల్లో 9,10 తరగతి విద్యార్థులకు విద్యాశాఖ అమలు చేసిన ''పరీక్షా పర్వ్'' కార్యక్రమం దోహద పడుతుందన్నారు. అలాగే 9.10 తరగతుల విద్యార్థులకు 'పరీక్షా పర్వ్'అవగాహన కార్యక్రమం ఉత్తేజితపూరితంగా నిర్వహించడంతో అనుకున్న ఉత్తీర్ణత శాతం సాధించవచ్చని అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు కష్టపడి చదవరాదని, ఇష్టంతో చదవాలని, అందుకు అవసరమైన మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పిస్తుందని అన్నారు. పబ్లిక్ పరీక్షలను ఎదుర్కోవలసిన విధానాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రాజన్న దొర పరామర్శ



పాంచాలిలో గన్ను సోమశేఖర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



కేశలిలో మాజీ సర్పంచ్ సింహాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజన్నదొర



రాజారావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



మాజీ సర్పంచ్ రాజారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పాచిపెంట: మండలంలో ఇటీవల అనారోగ్యం, ఇతర కారణాలతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖమంత్రి పీడికరాజన్నదొర బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేశలి మాజీ సర్పంచ్ ఆకుల సింహాచలం, మాతుమూరు వైస్ సర్పంచ్ బలగ సత్యనారాయణ, పాంచాలికి చెందిన గన్ను సోమశేఖర్ కుటుంబాలను ఆయా గ్రామాల్లోని వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. వారిమృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కుంటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడద్దని ధైర్యం చెప్పారు. ఎలాంటి అవసరం ఉన్నా నేరుగా తనను కలవాలని సూచించారు. మంత్రి వెంట, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి డోలబాబ్జీ, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి సలాది అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్రనాథ్, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

రాజారావు కుటుంబానికి పరామర్శ..

పార్వతీపురం టౌన్: మండలంలోని పెదమరికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మండంగి రాజారావు ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్‌లు ఆయన కుటుబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకోసం ఎంతో కృషి చేసిన నాయకుడిని కోల్పోవడం తీరని లోటని అన్నారు. ఆయన కుటుబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కృష్ణపల్లి సర్పంచ్ బి. రామినాయుడు, రాజు, గుంపస్వామి, పకీరునాయుడుతోపాటు పలువురు పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణ మహోత్సవం

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురంలో సీతారాముల కల్యాణ వార్షికోత్సవాలు మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం ఉత్సవమూర్తులకు చక్రతీర్థ స్నానం చేయించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదుల రామచంద్రరావు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పరిశోధనలతోనే మెరుగైన ఫలితాలు



విజ్ఞాన యాత్రకు బయలుదేరి వెళ్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: పరిశోధనలతోనే మెరుగైన ఫలితాలను సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న 60 మంది విద్యార్థులను బుధవారం ఫీల్డ్ విజిట్‌కు తీసుకువెళ్లారు. ఈ నెల 15 నుంచి 26 వరకు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని ఉద్యాన పరిశోధన కేంద్రాలను సందర్శించనున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్‌గా నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు సబ్జెక్టుపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుందన్నారు.